# ఖమ్మానికి చేరుకున్న.. హరీశ్‌రావు, కమలాకర్

- అజయ్ ఇంట్లో హరీశ్‌రావు, వద్దిరాజు ఇంట్లో 'గంగుల' బస
- నేడు వ్యవసాయ మార్కెట్లో మిర్చి, పత్తి యార్డుల సందర్శన
- చింతకాని మండలంలో రైతుల కుటుంబాలకు పరామర్శ



మాజీ మంత్రి హరీశ్‌రావుకు స్వాగతం పలుకుతున్న పువ్వాడ

ఖమ్మం, నవంబర్ 21: మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, గంగుల కమలాకర్ శుక్రవారం ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఇందుకోసం గురువారం రాత్రే వారు ఖమ్మానికి చేరుకున్నారు. మాజీ మంత్రి అజయ్‌కుమార్ ఇంట్లో హరీశ్‌రావు, వద్దిరాజు రవిచంద్ర ఇంట్లో గంగుల కమలాకర్ బసచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. పంటలకు గిట్టుబాటు ధరల్లేక వారు అనేక కష్టాలు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో పత్తి, మిర్చి పంటలకు గిట్టుబాటు ధరలను కల్పించాలనే డిమాండ్‌తో ఖమ్మంలోని వ్యవసాయ మార్కెట్‌ను హరీశ్‌రావు శుక్రవారం ఉదయం 7 గంటలకు సందర్శిస్తారు. రైతులతో మాట్లాడి వారి కష్టాలను తెలుసుకుంటారు. ఉదయం 11 గంటలకు ఖమ్మంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడతారు. మధ్యాహ్నం 12 గంటలకు చింతకాని మండలం ప్రొద్దుటూరులో ఆత్మహత్య చేసుకున్న రైతు బోజడ్ల ప్రభాకర్ కుటుంబ సభ్యులను, కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమ కేసుతో జైలుకు వెళ్లి వచ్చిన బీఆర్‌ఎస్ చింతకాని మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్యను పరామర్శిస్తారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. చింతకాని మండలం లచ్చగూడెంలో విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వల్ల మృతిచెందిన రైతు గూని ప్రసాద్ కుటుంబ సభ్యులను మధ్యాహ్నం ఒంటిగంటకు పరామర్శిస్తారు.

**హరీశ్, కమలాకర్‌లకు అజయ్, వద్దిరాజు స్వాగతం**

ఖమ్మం జిల్లా పర్యటన కోసం గురువారం రాత్రి ఖమ్మం వచ్చిన హరీశ్‌రావుకు పువ్వాడ అజయ్‌కుమార్ రాత్రి మమత ఆసుపత్రిలోని తన ఇంటి వద్ద స్వాగతం పలికారు. రాత్రి పువ్వాడ ఇంట్లోనే హరీశ్‌రావు బస చేశారు. హరీశ్‌కు స్వాగతం పలికిన వారిలో బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, కార్పొరేటర్ కర్నాటి కృష్ణ తదితరులు ఉన్నారు. హరీశ్‌రావుతోపాటు ఎర్రోళ్ల శ్రీనివాస్ కూడా వచ్చారు. అలాగే, తన ఇంటికి చేరుకున్న కమలాకర్‌కు ఎంపీ వద్దిరాజు స్వాగతం పలికారు. అనంతరం ఇద్దరూ కలిసి అజయ్ ఇంటికి వెళ్లి అక్కడున్న అజయ్‌ను, హరీశ్‌రావును కలిసి వచ్చారు.

# పకడ్బందీగా ఆన్‌లైన్ చేయాలి : భద్రాద్రి కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ) : ఇంటింటి సర్వే వివరాలను పకడ్బందీగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ డేటా ఎంట్రీ ఆపరేటర్లకు సూచించారు. గురువారం ఐడీవోసీ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్లతో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని తగు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఇంటింటి కుటుంబ సర్వే విజయవంతంగా కొనసాగుతున్నదని, అదే మాదిరిగా సర్వే వివరాలను డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు. కుటుంబాల వివరాలు అంశాల వారీగా ప్రత్యేక ఫార్మాట్‌లో నమోదు చేసేటప్పుడు ఎలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీవో సంజీవరావు, మాస్టర్ ట్రైనీలు పాల్గొన్నారు.

# రేపే ఖమ్మంలో ఆటో షో

- 'నమస్తే తెలంగాణ' ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహణ
- ఒకే వేదికపై కొలువుదీరనున్న వివిధ కంపెనీల వాహనాలు
- రుణ సౌకర్యం కల్పించడానికి అదే వేదికపై బ్యాంకర్లు

రఘునాథపాలెం, నవంబర్ 21 : సరికొత్త ఫీచర్లతో వివిధ రకాల మోడల్ వాహనాలు మార్కెట్‌లోకి వస్తున్నాయి. అదరహో అనిపించే విధంగా విభిన్న మోడళ్లతో కస్టమర్లను కనువిందు చేయనున్నాయి. అయితే నూతన వాహనం కొనుగోలు చేయాలనుకుంటున్నారా..? టెస్ట్ డ్రైవ్ చేసి మరీ మీకు నచ్చిన వాహనాన్ని కొనాలనుకుంటున్నారా..? ఏ కంపెనీ వాహనం కొనుగోలు చేయాల్నో తెలియక షోరూమ్‌లన్నీ తిరిగి గందరగోళానికి గురవుతున్నారా..? అయితే 'నమస్తే తెలంగాణ' ఆధ్వర్యంలో నిర్వహించే ఆటో ఎక్స్‌పో కార్యక్రమానికి తప్పక చేరుకోవాల్సిందే. కారు, బైక్ కొనుక్కోవాలనే ఆసక్తి ఉన్నవారి కోసం శని, ఆదివారాల్లో ఖమ్మం నగరంలోని ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల గ్రౌండ్‌లో 'ఆటో షో' పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించనున్నది. మీ అభిరుచులకు అనుగుణంగా అన్ని కంపెనీల ఆటో కంపెనీలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి నూతన మోడల్ వాహనాలను అందుబాటులో ఉంచనున్నది.

**ప్రత్యేక రాయితీలతో..**

ఆటో షో పేరుతో వాహన కంపెనీలను ఒక వేదికపైకి తీసుకురావడమే కాదు.. ప్రత్యేక రాయితీ సౌకర్యాన్ని సైతం కల్పించనున్నది. కంపెనీలు పలు వాహనాలపై పెద్ద మొత్తంగా రాయితీ సదుపాయాన్ని కల్పించనున్నాయి. ఇక్కడ వాహనాలను కొనుగోలు చేసిన వారికి ప్రత్యేక రాయితీలు ఇస్తారు. కొన్ని మోడల్ కార్లు, ద్విచక్ర వాహనాలను తగ్గింపు ధరలకు ఇవ్వనున్నారు. ఆటో షోలో పలు కంపెనీలకు సంబంధించిన సమగ్ర సమాచారం ఈ వేదికగా లభించనున్నది. ఆటో షోలో టెస్ట్ రైడ్ చేసి వాహనాలను కొనుగోలు చేసేందుకు అవకాశం కల్పించనున్నాయి. దీనికి తోడు వాహనాలకు రుణ సౌకర్యం కల్పించేందుకు పలు బ్యాంకులను సైతం ఆటో షోలో భాగస్వాములను చేయనున్నది. షోకు వచ్చే సందర్శకులకు ప్రత్యేక గిఫ్ట్‌లు అందించాలనే ఉద్దేశంతో కూపన్లను సైతం అందించనున్నారు. లక్కీ డిప్ ద్వారా కూపన్లను తీసి విజేతలకు బహుమతులు అందజేస్తారు.



ఖమ్మం నగరంలో బీఆర్‌ఎస్ ర్యాలీలో పాల్గొన్న మాజీ మంత్రి పువ్వాడ, ఎంపీ వద్దిరాజు, తాతామధు, లింగాల కమల్‌రాజు, సండ్ర, నాయకులు

లగచర్ల గిరిజన రైతులకు మద్దతుగా బీఆర్‌ఎస్ నాయకులు కదం తొక్కారు. ఏ ఒక్క రైతు సాగు భూమికి నష్టం వాటిల్లకుండా అండగా నిలబడతామన్నారు. ఫార్మా కంపెనీకి రైతుల భూములను తీసుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎంతకైనా పోరాడుతామని ప్రతినబూనారు. బీఆర్‌ఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం నగరంలోని మయూరి సెంటర్ నుంచి జడ్పీ సెంటర్ వరకు బీఆర్‌ఎస్ శ్రేణులు దండు కట్టి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి బీఆర్‌ఎస్ నేతలు, నాయకులు, కార్యకర్తలతోపాటు రైతులు, గిరిజన మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి హాజరయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి, రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. గత కేసీఆర్ పాలనలో పదేళ్లు కంటికి రెప్పలా కాపాడుకున్న రైతుల జోలికొస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఫార్మా కంపెనీ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నినదిస్తూ ముందుకు సాగారు.

# కేసీఆర్ అంటే మొక్క కాదు.. మహావృక్షం

- ఉద్యమ నేతను అణచడం రైఫిల్‌రెడ్డి వల్ల కాదు
- మంత్రి బాంబులు చివరికి 'కొడంగల్'లో పేలాయి
- ఖమ్మంలో 'లగచర్ల' సంఘీభావ ర్యాలీలో మాజీ మంత్రి అజయ్
- రాహుల్‌గాంధీకి 'లగచర్ల' కానరావట్లేదా?: వద్దిరాజు రవిచంద్ర
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మానసిక వ్యాధి సోకింది: తాతా మధు
- బీఆర్‌ఎస్ ప్రదర్శనకు భారీగా హాజరైన రైతులు, పార్టీ కార్యకర్తలు



మాట్లాడుతున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం, నవంబర్ 21: మొలకెత్తనివ్వబోవడానికి కేసీఆర్ మొక్క కాదని, మహా వృక్షమని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ స్పష్టం చేశారు. కేసీఆర్‌ను తుడిచిపెట్టడం రేవంత్‌కు కాదు కదా.. అతడి జేజమ్మకు కూడా వల్ల కాదని గుర్తుంచుకోవాలని హితవుచెప్పారు. ఉద్యమ సమయంలో ఉద్యమకారులను అణిచేందుకు జేబులో రైఫిళ్లు పెట్టుకొని తిరిగిన రేవంత్.. కేసీఆర్‌ను లేకుండా చేస్తానంటూ ధాంబికాలు పలుకుతుండడం విడ్డూరంగా ఉందని అన్నారు. లగచర్ల గిరిజన రైతులకు మద్దతుగా బీఆర్‌ఎస్ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఖమ్మంలో కొవ్వొత్తులతో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్ మాట్లాడుతూ.. రేవంత్‌కు ఇచ్చిన రూ.100 కోట్లు అమెరికాలో అదానీ దోచుకున్న రూ.2 వేల కోట్లలోవేనా అని ప్రశ్నించారు. ఉద్యమ సమయంలోనే చంద్రబాబునాయుడు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి లాంటి ముఖ్యమంత్రులే కేసీఆర్‌ను ఏమీ చేయలేకపోయారని గుర్తుచేశారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి వల్ల మాత్రం ఏమవుతుందని ఎద్దేవా చేశారు. కేసులు, జైళ్లు వంటివి కేసీఆర్‌కు, బీఆర్‌ఎస్‌కు, పార్టీ క్యాడర్‌కు కొత్తేమీ కాదని స్పష్టం చేశారు. వాటికి భయపడేవాళ్లమే అయితే తెలంగాణనే వచ్చేది కాదని తేల్చిచెప్పారు. ఉద్యమకారులను అణచివేసిన రేవంత్‌కు ఉద్యమమంటే ఏంటో చూపించే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని స్పష్టం చేశారు. ఉచిత హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌కు తన సీటును కాపాడుకోవడమే సరిపోతోందని విమర్శించారు.

## ఫార్మాసిటీ పేరుతో దోపిడీ..

సీఎం సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లోని లగచర్ల ప్రాంతంలో గిరిజన భూములను ఫార్మాసిటీ పేరుతో దోచుకోవడమే పనిగా రేవంత్‌రెడ్డి సోదరులు పనిచేస్తున్నారని స్పష్టం చేశారు. అడ్డొచ్చిన వారిని తొక్కుకుంటూ, ఎదిరించిన వారిపై కేసులు పెట్టుకుంటూ వెళ్తున్నారని అన్నారు. ఫార్మాసిటీకి తమ భూములను ఇవ్వబోమంటూ 9 నెలలుగా పోరాడుతున్న లగచర్ల గిరిజన రైతులకు కేటీఆర్, నరేందర్‌రెడ్డి మద్దతు నిలిచారని అన్నారు. అందుకు కేటీఆర్‌ను లోపలేస్తానంటూ రేవంత్ నీతిమాలిన మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో బాంబులు పేలతాయంటూ ఖమ్మానికి చెందిన ఓ మంత్రి ప్రగల్భాలు పలికారని, చివరికి అవి సీఎం నియోజకవర్గంలో పేలాయని ఎద్దేవా చేశారు.

## లగచర్లపై రాహుల్ స్పందించరెందుకు?: వద్దిరాజు

రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ.. అదానీపై రాహుల్‌గాంధీ పార్లమెంట్‌లో విమర్శలు చేస్తుంటే.. రేవంత్‌రెడ్డి మాత్రం అదానీకి ఎందుకు ఒత్తాసు పలుకుతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలుచేసే వరకూ ప్రజల పక్షాన బీఆర్‌ఎస్ పోరాడుతుందని స్పష్టం చేశారు. మణిపూర్ గిరిజన ప్రజలపై హింసకు వ్యతిరేకంగా పార్లమెంటులో పోరాడుతున్న రాహుల్‌గాంధీ.. తెలంగాణలోని లగచర్ల గిరిజనులకు జరుగుతున్న అన్యాయంపై ఎందుకు మాట్లాడడంలేదని ప్రశ్నించారు. ఈ నెల 25 నుంచి జరగబోయే పార్లమెంట్ సమావేశాల్లో ఇదే విషయంపై బీఆర్‌ఎస్ పోరాడుతుందని స్పష్టంచేశారు. పదేళ్ల గులాబీ పార్టీ పాలనలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం కూడా కాంగ్రెస్ సర్కారు పద్ధతినే అవలంబించి ఉంటే రేవంత్, భట్టిలు పాదయాత్రలు చేయగలిగేవారేనా? అని ప్రశ్నించారు. మహబూబాబాద్‌లో కేటీఆర్ చేపట్టిన మహాధర్నాకు పోలీసులు అనుమతి నిరాకరింపజేస్తే.. హైకోర్టు అనుమతిచ్చిందని అన్నారు. దీంతో రెట్టింపు సంఖ్యలో ప్రజలతో ధర్నా చేస్తామని స్పష్టంచేశారు.

## రేవంత్‌కు కేసీఆర్ ఫోబియా: తాతా మధు

ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డికి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఫోబియా పట్టిందని విమర్శించారు. ఈ మానసిక వ్యాధి తగ్గాలంటే ఆయన వెంటనే ఆసుపత్రిలో చికిత్స తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. దేశంలోనే అత్యధిక బూతులు మాట్లాడే సీఎంగా రేవంత్‌రెడ్డి చెడ్డ పేరు తెచ్చుకోవడంతో తెలంగాణ ప్రజలు తల ఎత్తుకోలేకపోతున్నారని అన్నారు. కేసీఆర్‌ను చంపుతానని, తుడిచివేస్తానని అనడం సీఎం స్థాయికి తగదని అన్నారు.

## ప్రజాస్వామ్యం అపహాస్యం: సండ్ర, లింగాల

సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు మాట్లాడుతూ.. రాష్ట్రంలో రేవంత్ సర్కారు నిరంకుశ విధానాలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని మండిపడ్డారు. డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ కేసీఆర్, కేటీఆర్‌లను టార్గెట్ చేయడమే రేవంత్ పనిగా పెట్టుకున్నారని అన్నారు. హామీలు అమలు చేయని రేవంత్‌రెడ్డిని గద్దె దించే వరకు బీఆర్‌ఎస్ పోరాడుతూనే ఉంటుందని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు రాకేశ్‌రెడ్డి, కొండబాల కోటేశ్వరరావు, కూరాకుల నాగభూషణం, పగడాల నాగరాజు, ఆర్‌జేసీ కృష్ణ, బొమ్మెర రామ్మూర్తి , పలువురు కార్పొరేటర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## జోష్‌ను నింపిన ర్యాలీ

కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో 11 నెలలుగా నెలకొన్న ఆగ్రహం ఒక్కసారిగా వ్యక్తమైంది. కాంగ్రెస్ మాయమాటలు నమ్మి ఓట్లు వేసి గెలిపిస్తే ఇచ్చిన ఏ ఒక్క హామీనీ నేరవేర్చకుండా కాలయాపన చేస్తోందని అన్ని వర్గాల ప్రజలు మండిపడుతున్నారు. శుభకార్యాలు, అశుభ కార్యాల వద్ద ఏ నలుగురు కూడినా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపైనే చర్చించుకుంటున్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఉంటే ఇలా ఉండేది కాదంటూ మాట్లాడుకుంటున్నారు. సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి ప్రతిపక్ష నేతలపై జుగుప్సాకరమైన భాషను వినియోగిస్తున్నారని అనుకుంటున్నారు. ఈ క్రమంలో బీఆర్‌ఎస్ కూడా ప్రజాక్షేత్రంలోకి రావడంతో ప్రజలంతా మద్దతుగా వస్తున్నారు. ఈ నేపథ్యంలో లగచర్ల గిరిజన రైతుల ఉద్యమానికి సంఘీభావంగా బీఆర్‌ఎస్ శ్రేణులు గురువారం ఖమ్మంలో నిర్వహించిన ర్యాలీకి రైతులు, గిరిజన మహిళలు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. మయూరిసెంటర్ నుంచి ర్యాలీ మొదలుకాగా.. ముగింపు ప్రదేశం వరకూ రహదారి కిక్కిరిసిపోయింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా, లగచర్ల రైతులకు మద్దతుగా రైతులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. ర్యాలీ విజయవంతంతో బీఆర్‌ఎస్‌లో జోష్ పెరిగింది.

# కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ 'సార్'!

- పందిళ్లపల్లి పాఠశాలను తనిఖీ చేసి.. 6వ తరగతి విద్యార్థులకు గ్రామర్ బోధన
- లక్ష్యాలను ఎంచుకుని చదువుకోవాలని కలెక్టర్ సూచన



మధిర : తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

మధిర, నవంబర్ 21 : చింతకాని మండలం పందిళ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్.. సార్‌గా అవతారమెత్తారు. తరగతి గదులను కలియతిరుగుతూ వెళ్లిన ఆయన 6వ తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయురాలు ఇంగ్లిష్ బోధిస్తున్న తీరును పరిశీలించారు. విద్యార్థులతో కలిసి పాఠం విన్నారు. తర్వాత కలెక్టర్.. ఉపాధ్యాయుడిగా మారి స్వయంగా బోర్డుపై ఇంగ్లిష్ పాఠాన్ని, గ్రామర్‌ను విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించారు. పుస్తకంలో ఉన్న పాఠ్యాంశాన్ని పిల్లలతో చదివిస్తూ.. వారి అనుమానాలు నివృత్తి చేస్తూ ముచ్చటించారు. 'పాఠశాలలో ఇంకా ఏమేం వసతులు కావాలి? జీవితంలో ఎలాంటి ఉద్యోగం చేస్తారు? ఏం కావాలనుకుంటున్నారు? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డిజిటల్ ల్యాబ్‌లో పిల్లలతో కలిసి కలెక్టర్ నేలపై కూర్చొని క్లాస్‌లు వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే లక్ష్యాలను ఎంచుకుని ఆ దిశగా కష్టపడి చదవాలని, విద్యతోనే సమాజంలో ఉన్నత స్థానాలకు ఎదగవచ్చున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు రెండు జతల ఏకరూప దుస్తులు, పాఠ్య, నోట్‌బుక్స్, నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని 50 పాఠశాలల్లో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసి కూరగాయలు పండిస్తున్నామని, వాటిని సంరక్షించే బాధ్యతను విద్యార్థులు తీసుకోవాలన్నారు. విద్యార్థులు ఆంగ్ల భాషలోనే మాట్లాడుకునే విధంగా ఉపాధ్యాయులు వారిని ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు.

# జైళ్లు.. ముద్దాయిలను మార్చే ఆశ్రమాలు

- న్యాయ వ్యవస్థ ద్వారా ఉచిత న్యాయ సేవలు
- రీ ట్రీట్‌తో సిబ్బందిలో కొత్త ఉత్సాహం
- డీఎల్ఎస్ఏ కార్యదర్శి చంద్రశేఖర్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అసిస్టెంట్ ఎక్సైజ్ కమిషనర్ గణేశ్

ఖమ్మం రూరల్, నవంబర్ 21 : జైళ్లు ఒకప్పటి మాదిరి కాకుండా నేరప్రవృత్తి గల ముద్దాయిలను సమాజానికి ఉపయోగపడే మనుషులుగా మార్చే ఆశ్రమాలుగా మారాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి చంద్రశేఖర్, ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ గణేశ్‌లు అన్నారు. గురువారం దానవాయిగూడెంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జైళ్ల శాఖ సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన రీ ట్రీట్-2024 రెండో రోజు ముగింపు కార్యక్రమం జిల్లా జైలు పర్యవేక్షణాధికారి శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగింది. తొలుత జైలర్ జైలులోని ఖైదీల గురించి తీసుకుంటున్న రోజువారీ చర్యల గురించి వివరించారు. అనంతరం లీగల్ సెల్ సెక్రటరీ మాట్లాడుతూ న్యాయ వ్యవస్థ ద్వారా సేవలు ఏ విధంగా పొందవచ్చు, ఉచిత న్యాయ సేవల గురించి వివరించారు. రీ ట్రీట్ ద్వారా సిబ్బందిలో కొత్త ఉత్సాహం తీసుకురావడంతోపాటు సిబ్బంది పడుతున్న ఇబ్బందులు, వారు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా అధికారులతో చర్చించి పరిష్కరించుకునే అవకాశం కలుగుతుందన్నారు. జైళ్ల శాఖ, న్యాయ శాఖ రెండూ సమన్వయంతో కలిసి అందిస్తున్న సేవలు ఎంతో అమూల్యమైనవని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా జైలు సబ్ అధికారి విజయ్ డేవిడ్, జైలు అధికారి వెంకటేశ్వర్లు, జైలర్లు సకృనాయక్, జి.లక్ష్మీనారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


